


# వృక్షపు మోడు

అప్పాజీ



వేసవికాలపు రోజులు. సూర్య భగవానుని ఆగ్రహానికి పేద, గొప్ప విచక్షణ లేకుండా మాడి పోతున్నారు. మనసుకు ఆనందం, దేహానికి సుఖం లేని జీవితమైపోయింది జానకమ్మకు. పదిళ్ళకు నీళ్ళు పోసి, అలసిపోయి వేపచెట్టుకింద విశ్రాంతి కని నిల్చుంది. ఆడపుట్టుక పుట్టేకన్నా అడవిలో మానై పుట్టటం మంచిదన్న పెద్దల మాటలు గుర్తుకు వచ్చాయి జానకమ్మకు. . . అవును, మరి. తన తాతలనాటినుంచీ ఆ చెట్టు అక్కడే ఉంది. ఎందరో దానికింద విశ్రాంతి తీసుకుంటున్నారు. మేకలకు, గొర్రెలకు కొమ్మలు కోసుకుంటు న్నారు. ఎండిన పుడకల్ని వంటచెరుకు

కున్నా రమ్మా!"

తల్లితండ్రులవైపు చూసింది శాంతి. ఆ చూపులో వియోగబాధ ఉంది. తండ్రి హృదయం ద్రవించింది. ద్రవించిన హృదయం కన్నీరుగా శాంతి చేతులమీద జారింది. ప్రపంచమంటే ఏమిటో తెలీక అన్నాళ్ళూ అనాయాసంగా గడిపిన శాంతికి, అప్పటికప్పుడే తెలీని బాధ ఆవరించింది. పెళ్ళయిన తరవాత అత్తవారింటికి తరలిపోతున్న దృశ్యం గుర్తుకు వచ్చి భయపడిపోయింది.

"నీవ్వీ, మేమూ, పైన భగవంతుడూ ఉన్నాం కదా! భయం లేదు. పై అరుగుమీద రంగయ్య తాత దగ్గిర కాసేపు కూర్చో. మనను కుదుట పడుతుంది" అని శాంతిని పైకి పంపించారు.

ఇంతలో పోస్టుమన్ తెచ్చి ఇచ్చిన జాబు కనకాంబరరాజు ఆత్రంగా విప్పి, "పెళ్ళివారు వస్తున్నారు, జానకీ! మనం అన్ని ఏర్పాట్లకూ పూనుకోవాలి. మన లోటుపాటులు వాళ్ళకు తెలీకుండా చూసే బాధ్యత మనిద్దరిదీను" అని, భార్య చెవిలో మరికొన్ని విషయాలు చెప్పాడు. జానకమ్మ భయపడుతూనే అంగీకారాన్ని తెలియజేసింది.

శాంతి తనతోపాటు పై అరుగుమీద కూర్చున్న రంగయ్యతాతను బ్రహ్మంగారి తత్వాలు పాడు, తాతా అని అడుగుతూంది. రంగయ్యతాత సితారు తీసి భక్తితో పాడటం మొదలుపెట్టాడు. మనసులోని బాధను తాత్కాలికంగా మరిచిపోయేందుకని జానకమ్మ, కనకాంబరరాజు పైకి వచ్చి గుమ్మంలో కూర్చున్నారు. ఎంతో భక్తితో పాడుతున్న తాత శ్రుతితో శాంతికూడా తన మధురమైన కంఠాన్ని జతచేసింది. అలా అరగంట గడిచింది. అందరికి మనసులలో ఎంతో ప్రశాంతత కుదిరింది. జానకమ్మ లోనికి పోయి నిమ్మనీరు, పంచదార కలిపి తెచ్చి అందరికి ఇచ్చింది. "ఓం! శాంతి! శాంతి!" అనుకుంటూ రంగయ్యతాత అది పుచ్చుకుని, శాంతిని ఆశీర్వదించి, ఎదురుగా ఉన్న తన పూరింటికి పోయాడు.

అట్లాంటి రోజులు మరికొన్ని గడిచాయి. శాంతి పెళ్ళిరోజుకూడా వచ్చింది. పచ్చని తోరణాంతో పెండ్లి పందిరి అలంకరించారు. రంగు రంగు కాగితాలతో పూలమాలలు కట్టారు. మాలలు గాలికి ఊగుతూంటే కనుల పండువుగా ఉంది. సన్నాయి సంగీతపు రికార్డులు మైకులో వస్తున్నాయి. రంగయ్యతాత పిందుగా తలపాగా చుట్టి, పంగనామాలు పెట్టుకుని పందిరికింద ఇటు అటు తిరుగుతున్నాడు.


"అమ్మా! శాంతమ్మతల్లీ! రోజూ నా క్షేమాన్ని కనుక్కునేదానివి. ఒంట్లో నలతగా ఉంటే మందూ మాకూ ఇచ్చి, కాఫీకూడా ఇచ్చేదానివి. నా చేత భగవంతుని పాటలు అత్యంత భక్తిశ్రద్ధలతో పాడించుకునేదానివి. నువ్వు వెళ్ళిపోతావు. మీ ఇంటి అరుగుమీద ఒంటరిగా కూర్చోవాలి. ఈ ముసలికాలంలో ఒంటరిగా విడిచి పోతున్నావా, శాంతీ!" అని తనలో తానే దిగులుపడిపోతూ అప్పటికప్పుడే ఎంతో నీరసించిపోయి, చెమర్చిన కళ్ళు తలపాగాతో తుడుచుకుంటున్నాడు. ఇటు అటు తిరుగుతూ కళ్ళు తుడుచుకుంటున్న రంగయ్యతాతను కిటికీలోంచి కనిపెడుతూనే ఉంది శాంతి. "తాతా!" అని పిలిచింది. కిటికీ దగ్గిరికి వచ్చిన తాతకు ఫ్లాస్కులోని వెచ్చనికాఫీ పోసి ఇచ్చింది తాగమని. కళ్ళు తుడుచుకుంటూ "కృష్ణార్పణ" మంటూ కాఫీ తాగాడు.

"నీ దూరంగా వెళ్ళిపోతున్నావని పాపం, తాత ఏడుస్తున్నాడే, రేణుకా!"

శాంతి అన్న మాటలకు రేణుక వెక్కివెక్కి ఏడ్చింది. "ఇన్నాళ్ళూ కలిసిమెలిసి ఉన్నాం. మా అందరినీ విడిచి అత్తవారింటికి పోతున్నావని మా కెంతో దిగులుగా ఉందే, శాంతీ!" అంది.

"ఏం చేస్తాం? ఆడపుట్టుక పుట్టాక తప్పుతుందా, రేణూ!. . . ఈ వివారం తాత్కాలికం. ఎవరి సంసారంలో వాళ్ళు పడ్డాక ఎవరి సుఖం వారిది. ఎవరి బాధలు వారివి. ఇది నా ఇల్లు అన్న బాధ్యత పట్టుకుంటుంది."

సత్య, పుష్ప, సరోజ, సుందరి మున్నగువారు ఏమీ అనలేక పోయారు. శాంతిని ముస్తాబు చేయడంలో నిమగ్నులై పోయారు. కనకాంబరరాజు లోన బితుకు బితుకుమంటున్నా పైకి గంభీరంగా తిరుగుతున్నాడు. బంధువులు వస్తున్నారు. అందరినీ ఆప్యాయంగా పలుకరించి



కూర్చోబెడుతున్నారు. జానకమ్మ తన మెడలోని కాసులపేరు శాంతిమెడలో వేసింది. శాంతమ్మ ఫోటోకు దండం పెట్టి శాంతిచేత దండం పెట్టించింది. అందరూ కలిసి శాంతిని పెళ్ళి మండపం దగ్గిరికి తీసుకువెళ్ళి కూర్చోబెట్టారు. కనకాంబరరాజు శరీరం ముచ్చెమటలు పోస్తోంది. జానకమ్మ పిరికి ధైర్యంతో భర్తవైపు, బంధువులవైపు చూస్తోంది. పవిత్ర మంత్రోచ్చారణల మధ్య, బంధుమిత్రుల ఆశీర్వచనముల మధ్య శాంతి మెడలో వరుడు భాస్కరరావు తాళి కట్టాడు. ఇక అత్తవారు అల్లుడికి చదివించ వలసిన కట్నాల చదివింపులు వచ్చాయి. ఎంత పిలిచినా కనకాంబరరాజు లోపలి గదిలోనుంచి రావడం లేదు. భయంతో శరీరం కంపించి పోతూంది. 'శాంతి కే అపాయమూ కలగకుండా చూడు, భగవంతుడా!' అని ప్రార్థిస్తున్నాడు. ఇంతలో ఒకాయన పెళ్ళిపందిరిలోనికి వచ్చి అందరిని కాస్త నిశ్శబ్దంగా ఉండమన్నట్టు సంజ్ఞ చేశాడు.

"పాపం! కనకాంబరరాజు కట్నానికని వేరుగా పెట్టిన డబ్బు, నగలు గల పెట్టె ఈ పెళ్ళిసందడిలో ఎవరో కాజేశారు. . . రాజుగారు లోన అయోమయ స్థితిలో ఉన్నారు" అన్నాడు. ఇహ ఎవరి నోటికి వచ్చినట్టు వారనుకుంటున్నారు. కొందరు నిజమని, కొందరబద్ధమని ఊహాగానం చేస్తున్నారు. జానకమ్మ శాంతి పక్కనే నలుగురి ముఖాలు చూడలేక కుప్పలా కూలిపోయింది.

"ఉన్నదంతా కట్నంకిందే ఇస్తే తనకేం మిగులుతుంది? అందుకని జానకమ్మ కనకాంబరరాజుచేత ఈదో నాటక మాడించింది" అన్న మాటలు జానకమ్మకు శూలాల్లా గుచ్చుకున్నాయి.

"కట్నం తరవాత ఎలా అయినా ఇప్పుకుంటారు. . . శాంతి మెడలో ఉన్న



కట్నకానుల పేరును కట్నంకింద ఆది ఇచ్చేవరకూ ఉంచు, వదినా!'' అంది నెమ్మదిగా జానకమ్మతో పెళ్లికొడుకు దగ్గిర కూర్చున్న శాంతి అత్త.

''అట్టే! అదెట్లా అవుతుందేమిటి? శాంతి కాంతౌడుగుకింద ఈ కానుల పేరు మొదట్నించీ ఇస్తానన్నది. . . కట్నం వేరు, కానులపేరు వేరు.'' పెళ్లికి ఈడొచ్చిన పెళ్లికాని పెళ్లికొడుకు చెల్లెలు ఖచ్చితంగా తేల్చి చెప్పింది.

''ఏమే! ఇలా రా! ఒక్కటి మాత్రం ఖచ్చితంగా అడిగి చూడు... ఎన్నాళ్లలో అనుకున్న కట్నం ఐదు వేలూ ఇస్తారో కనుక్కో! ఆ కట్నం రావాలి. ఉన్న ఒక్క అమ్మాయి పెళ్లి నిశ్చయించుకోవాలే! ఎంత అఘాయిత్యం తెచ్చిపెట్టారే!'' అని శాంతి మామగారు చిందులు తొక్కేస్తున్నారు.

''అమ్మా! జానకమ్మా! ఓమారిలా రా, అమ్మా! బాబూ! కనకాంబరరాజూ! మీరుకూడా ఇలా రావాలి'' అని శాంతి అత్తగారు ఆ ఇద్దరు దంపతుల్నీ పక్కకు పిలిచింది. వాళ్లిద్దరూ భయంతో వచ్చారు.

''మన మనుకున్న కట్నం ఇవ్వలేదని రసాభాస చేసి లేచిపోవడ మన్నది అంతగా బాగుండదు. అందుకనే ఏ గొడవా చెయ్యకుండా ఇంతవరకూ కూర్చున్నది. ఎప్పట్లో ఆ కట్నం ఇవ్వగలరో తేల్చి చెప్పండి.''

ఆ దంపతు లిద్దరూ ఒకరి ముఖాలు ఒకరు చూసుకున్నారు. కనకాంబర రాజుకు ఏ కోశానా ధైర్యం లేకపోయినా జానకమ్మ ధైర్యం చేసుకుని మూడు నెలల్లో ముట్టచెపుతామని శపథం చేసి నట్టు చెప్పింది. దానితో అందరూ ఒక అంగీకారానికి వచ్చారు. పెళ్లి ముగిసింది.

ఇంటిమీద, పొలంమీద చేసిన అప్పులు మితిమీరిపోయాయి. అసలు ధరకన్న అప్పులే ఎక్కువ కనిపిస్తున్నాయి. అప్పు సరిచూసి ఇంటిని, పొలాన్ని కాజేయాలని అప్పులవాళ్లు చూస్తున్నారు. జానకమ్మకు ఉన్న మతి కాస్తా పోయింది.

''శాంతి దృష్టిలో నేను సవితితల్లి గానే మిగిలిపోతాను. ఎలా కట్నం చెల్లించడం? కానులపేరు కట్నం కింద తీసుకొమ్మంటే బాలతౌడుగన్నారు. భరించరాని ఆర్థికబాధల్లో ఆయన చిక్కుకున్నారు. ఆరోగ్యం దెబ్బ తింటే నే నేం కాను? చేతి పాప బ్రతుకేం గాను?''

జానకమ్మ కివే ఆలోచనలు. కనకాంబరరాజు హృద్రోగంతో బాధ పడడం మొదలుపెట్టాడు. భర్తను దక్కించుకుందామని ముక్కుపుడకతో సహా దబ్బుకింద మార్చి మందులకు పెట్టింది జానకమ్మ. కాని భగవంతుడు చిన్నచూపు చూశాడు. జానకమ్మ వైధవ్యం అనుభవించక తప్పలేదు.

గభీమని మెలకువ వచ్చింది. గత జీవితం గుర్తుకువచ్చి ఎంతో నీరసించిపోయింది. పమిటచెంగున పరపరలాడుతున్న నీలిరంగు ఇన్‌లాండ్ కవరును విప్పింది.

''పిన్నీ! నాన్నపోయి అయిదేళ్లయింది. అయినా, కట్నంసంగతి నీ వేమీ అనటం లేదు. అత్తమామలు, ఆడపడుచు యమయాతన పెడుతున్నారు. ఎలా అయినా సాధించితీరాలని విశ్వప్రయత్నం చేస్తున్నారు. సవతితల్లి కనక ఎలాగూ ఇవ్వదని అంటున్నారు. మా పిన్ని మంచిది, తప్పక ఇస్తుందని నచ్చ చెపుతున్నాను. కాని, నీవు సమాధానం రాయటం లేదు. ఇలాంటి జాబులు ఎన్నో రాశాను. నిజంగా నీవు విప్పి చదువుతున్నావా? నాన్న పోయారు. నన్నెవరు పిలుస్తారు, చెప్పు? కట్నం ఇచ్చినవరకు ఇంటిముఖం చూట్టానికి వీల్లేదని ఈ అయిదేళ్ల నుండీ పట్టు పడుతున్నారు. మీ వాళ్లతో కలిసి పొలం, ఇల్లు అనుభవిస్తున్నావను కుంటాను. ఇదే నా ఆఖరు జాబు. సవతితల్లివి, బుద్ధి చూపించుకున్నావు. సవతితల్లివి. నాకు ద్రోహం చేశావు. ఇలాఅయినా అంటే నీకు పౌరుషం వచ్చి జాబు రాస్తావని, నా కట్నండబ్బు నాకు ముట్టచెబుతావని రాస్తున్నాను. ఇంతకూ మా నాన్న డబ్బుమీద నీ కే మధికార ముందని? తప్పక జాబు రాయాలి. లేదా స్వయంగా వచ్చి, పెద్దల సమక్షంలో నా వాటా నేను తీసుకుంటాను. నీ సవతి కూతురు — శాంతి.''

జానకమ్మ కళ్లలో నీళ్లు లేవు. ఏనాడో ఆరిపోయాయి. శాంతి మనఃశాంతి కోసం బలవంతంగా రప్పించుకుందామని విశ్వప్రయత్నం చేసింది కాని, కన్నీళ్ల బదులు పేలవమైన నవ్వు వచ్చింది.

'అమ్మా, శాంతీ! మీ అత్తమామల హృదయాన్ని ఎంత చక్కగా విప్పి చెప్పావమ్మా! నిజంగా వాళ్లను అభినందించకుండా ఉండలేక పోతున్నాను. కారణం చెప్పనా? మరొకళ్లయితే అక్కడికక్కడే పెళ్లి రద్దుచేసుకుని వెళ్లిపోయేవారు. కాని, నేను సవతి తల్లిని. శూలాల్లాంటి నాలుగు మాటలాడి రాబట్టుకోవచ్చు ననుకొని వెళ్లి పోయారు. నేను నా నిస్సహాయస్థితిని తెలియజేసుకున్నాను. చెప్పినా నమ్మనని ఈమారు నేనుముష్టి దానికన్న హీనమైన బ్రతుకు బ్రతుకుతున్నానని, నీళ్లు మోసుకు బ్రతుకుతున్నానని వ్రాస్తే నమ్ముతావేమో! రంగయ్యతాతను కలుసుకుని నా బదులు వ్రాయమని చెబుతాను. . . తాత రాస్తే నువ్వు తప్పక నమ్ముతావు.'

ఇంతలో పాప లేచింది. ''రాత్రికి బువ్వొండుతావా?'' అన్న మాటలు విని తుళ్లిపడింది.

''నువ్వే లేకపోతే అతి సులువుగా చనిపోయేదాన్ని. కాని, నీ కన్న ముందు నేను చస్తే నీ గతి మరీ హీనమై పోతుందమ్మా! అందుకనే ఈ హీనమైన బ్రతుకు. నా కన్న ముందు నువ్వు చనిపోతే ఎంత బాగుండేది, పాపా!'' అని జానకమ్మ వలవలా ఏడ్చింది.

పిల్ల చావు బలవంతంగా కోరుకుంటున్న జానకమ్మ తనలో తాను ఎంతో బాధ పడింది. పాపను దగ్గిరగా లాక్కుంది. నుదుటిపై గట్టిగా ముద్దు పెట్టుకుంది.

''అమ్మా! రంగయ్యతాతను పిలుచుకువస్తావా?''

''తీసుకొస్తానమ్మా! ఎంత దూరమూ నడిచేస్తా.''

''తొందరగా రావాలి. పంతులమ్మగారిచ్చిన టీగుండ ఉంది. పది

పైనల పంచదార తెచ్చి, టీ చేస్తాను. తాతా, నువ్వూ, నేమా తాగుదాం."

పాప చురుకుగా లేచింది. రంగయ్యతాతను తీసుకువస్తానమ్మా అంటూ ఛెంగుఛెంగున గెంతుతూ, పరుగులు తీసింది. మైలు దూరం నడిచి రంగయ్యతాతను బలవంతంగా లాక్కువస్తోంది. తాతకన్న ముందు తాను తల్లిని చేరుకోవాలన్న ఉత్సాహంతో, పాప రోడ్డుని ఇటు అటు చుట్టుకుంటూ వస్తోంది. బస్సొస్తున్నాయమ్మా, జాగ్రత్త! అని రంగయ్యతాత చెబుతూనే ఉన్నాడు. పాప తన హుషారులో తానుంది. ఇంటికి దగ్గిరసా వచ్చారు. ఉరకలు వేసిన ఉత్సాహంలో అటునుంచి ఇటు ఒక్క పరుగు తీయడమూ, ఎవరో నూతన దంపతులు కొత్తగా కొని, నేర్చుకుంటున్న మోటర్ సైకిల్ పాపమైనుంచి వెళ్లడమూ ఒకేమారు జరిగిపోయాయి.

రంగయ్యతాత భయంకరంగా కేకవేశాడు, "జానకమ్మా" అంటూ. జానకమ్మకూడా భయంతో పైకి వచ్చింది. రక్తపు మడుగులో పాప! పక్కనే గడగడలాడిపోతున్న నూతన దంపతులు! కొనఊపిరితో ఉన్న పాపను ఇంటికి తీసుకువచ్చారు.

ఆ నూతన దంపతులు జానకమ్మ కాళ్లమీద పడ్డారు.

"అమ్మా! కొత్తగా వివాహమైన వాళ్లం. పాప గభీమని బండికిందికి వచ్చింది. నా పసుపుకుంకుమ రక్షణ మీ చేతిలో ఉంది" అని ఆ నూతన వధువు బ్రతిమిలాడ మొదలుపెట్టింది. ఇంటిచుట్టూ చేరినవాళ్లు జానకమ్మ గత జీవితానికి, ప్రస్తుత పరిస్థితికి, పాప అకాల మరణానికి విచారిస్తున్నారు. రంగయ్యతాతను ఆ నూతన దంపతులు పక్కకు పిలిచి, రెండు వేల రూపాయలు రొక్కం ఇస్తామన్నారు. తమమీద కేసదీ ఏదీ లేకుండా చేయమని ప్రాధేయపడ్డారు. జానకమ్మను రంగయ్యతాత పక్కకి పిలిచి, వాళ్ల నిర్ణయాన్ని చెప్పాడు.

"పాప ఎలాగూ తిరిగి రాదు. పాపం, వాళ్లు కావాలని పాపను తొక్కించలేదు. తప్పక అంగీకరించు, జానకమ్మా!"

జానకమ్మ ఆవేదన దిగమింగి, "సరే!" అంది.

మూడు రోజులు గడిచాయి. పాప జ్ఞాపకార్థం చిన్న ప్రమిదలో నూనె పోసి చిరుదీపం పెట్టింది.

'ఉండి నువ్వు సుఖపడే దేముంది, పాపా!. . . త్వరగా దైవసన్నిధికి చేరుకున్నావు. ఆలోచించి చూస్తే చావు కన్న సుఖమైంది మరొకటి లేదు సుమా!' అనుకుంటూండగా రంగయ్యతాత వచ్చి, చేతిలో ఉన్న మూట కింద పెట్టి, "జానకమ్మా! చేసిన బియ్యం తీసుకువచ్చాను. కడిగి పొయ్యిమీద పెట్టుకో. . . పోయినవాళ్లు రారు. ఉన్నవాళ్లకు తప్పదుగా!" అన్నాడు. జానకమ్మ ఏమీ అనలేదు. మిణుకు మిణుకు మంటున్న దీపంవైపు చూస్తోంది.

"ఈ పిళ్ల మోసే పని మానెయ్యి, జానకమ్మా! ఆ డబ్బుందిగా! ఏదో కాయా కసురూ తెచ్చి ఇంటిదగ్గిర చిన్న దుకాణం పెట్టుకో! లేదా తెలిసిన వాళ్లకు వడ్డీకి ఇచ్చి చూడు ... ఒక్క ప్రాణాన్ని. ఏదో కాలక్షేపం చేసెయ్యవచ్చు."

జానకమ్మ రంగయ్యతాత వైపు తీక్షణంగా చూసింది. తాత చేతిని కళ్ల కద్దుకుని బావురుమని ఏడ్చింది.

"తాతా! పాప రక్తపుకూడుతో నన్ను బ్రతకమంటావా? అదిమాత్రం నేను చెయ్యలేను. అది చచ్చి నా కెంత సహాయం చేసిం దనుకున్నావు! ఈ ఉత్తరం చూడు. శాంతిచేత అత్తమామలు రాయించారు. నేను సవతి తల్లిని. నే నెంత దీనస్థితిలో ఉన్నాని చెప్పినా నమ్మరు. అందుకనే సమాధానం రాయలేదు. దీనికి సమాధానం రాయించాలనే నిన్ను మొన్న పిలిపించాను. కాని, అలా జరిగింది. శాంతి కట్నం నే ఇవ్వలేకపోయినా, మిగిలిన రెండు వేల కట్నం దాని రక్తంలో రక్తం పెట్టి పుట్టిన పాప రక్తం ధారపోసి నా కిచ్చింది. ఆ డబ్బు అందుకే వాడుతాను. ఈ డబ్బు పంపే పద్ధతికూడా నువ్వు ఆలోచించు, తాతా!" అని జాబు ఇచ్చింది.

అందులో శాంతి విస్తారంగా వ్రాసిన మాట లున్నాయి. హీనమైన మాటలతో జానకమ్మను గాయపరిచి ఎలాగైనా కట్నండబ్బు లాగాలని శాంతి అత్తమామలు అన్నాళ్లు చేస్తున్న ప్రయత్నం — జానకమ్మ తనంత హీనమైన బ్రతుకు బ్రతుకుతున్నా, ఒక్కనాడైనా వాళ్లకు తన జీవితాన్ని తెలియపరచలేదుకదా! దేహీ అని యాచించలేదు. మరునాడు కలుసుకుంటానని చెప్పి రంగయ్యతాత ఇంటికి చేరుకున్నాడు.

* * *

"శాంతీ! శాంతీ! రెండు వేల రూపాయలు గల ఇన్సూరు కవరు వచ్చింది. సవతితల్లి దగ్గిర అయిదేళ్ల తరవాతనైనా మిగిలిన సొమ్ము సాధించావు. అట్లా ఉండాలి ఆడపిల్లలు. అంతేకాని, ప్రతిదీ భగవంతునిమీద పెడితే మనకు పూర్తి తిరుపతి క్షౌరమే!" ఇంట్లో అడుగు పెడుతూనే భాస్కరరావు అన్నాడు.

"పిన్ని పంపిందండీ! మన ఉత్తరాలు ఎన్ని అందినా ఒక్కదానికి కూడా సమాధానం రాయలేదు. ఆ డబ్బుతోపాటు ఏదైనా జాబు ఉందేమో చూడండి."

"ఆఁ ఉంది. నేను డబ్బు మాత్రం లెక్కపెట్టాను. సరిగ్గా ఉంది. ఉత్తరం చదవటానికి ఓపికా, శ్రద్ధా నాకు లేవు. ఏదో చూడు" అని ఇచ్చాడు.

శాంతి ఆత్రంగా విప్పింది.

రంగయ్యతాత పిన్నితరఫున వ్రాసిన జాబు.

తాత, పిన్ని, పాప, చనిపోయిన నాన్న, తన ఇంటిముందరి అరుగు కళ్లకు కట్టినట్లు కనుపించాయి. కట్నం పేరుమీద తన పుట్టిన ఇంటికి, గ్రామానికీ ఆ అయిదేళ్లు దూరమైపోయిన శాంతికి అప్రయత్నంగ కళ్లనీళ్లు తిరిగాయి. ఉత్తరం విప్పీ విప్పగానే తాత నిండుమనసుతో పంపిన ఆశీర్వచనా లందుకుంది.

జాబును కళ్ల కద్దుకుంది.

తాత తల నిమిరినట్టయింది.

బ్రహ్మంగారి తత్త్వాలు స్పష్టంగ వినిపిస్తున్నాయి.

"అమ్మా, శాంతీ! నీకు వేంకటేశ్వరుని కరుణాకటాక్షం అన్ని వేళలా ఉండుగాక! సకల సిరిసంపదలతో వర్ధిల్లాలని మనఃపూర్తిగా నేను నిన్నాశీర్వదిస్తున్నా నమ్మా! పిన్ని సవతితల్లి. ఆవిడ రాస్తే నమ్మవని నేను రాస్తున్నాను. నా మీద నీకు అచంచలమైన భక్తి ఉంది. నమ్ముతావని విశ్వసిస్తున్నాను. నాన్న బ్రతికి ఉన్న రోజుల్లో చేసిన విపరీతమైన అప్పులకు ఇల్లు, పొలం పోయింది. నాన్న కన్ను మూశారు. పిన్ని పాపతో ఏ ఆధారమూలేని దిక్కుమాలిన పక్షి అయింది. నిన్నటివరకూ నానా పాచిపనులు చేస్తూ, నీళ్లు మోసుకు బ్రతికింది. నీవు రాసిన జాబులు మొదట్లో విప్పేది. రాను రాను విప్పటం మానేసింది. తన స్థితి వివరించి రాసినా నమ్మవని రాయలేదు. మొన్న మొన్న నీవు రాసిన జాబుకు నా చేత సమాధానం రాయించాలని పాపతో పిలిపించుకుంది. కాని, ఇంటికి దగ్గిరసా పాపను ఓ నూతన దంపతు లెక్కివస్తున్న మోటర్ సైకిల్ పొట్టను పెట్టుకుంది. వాళ్లు తమ మీద ఏ కేసూ లేకుండా చెయ్యమని కాళ్లావేళ్లా పడి, రెండువేల రూపాయలు చేతిలో పెట్టారు. కాదనలేకపోయింది. కారణం—తేలుకొండెలాంటి నీ జాబులు! తీసుకుంది. పాప రక్తపుకూడు ఈ కవరులో ఉంది. తిరిగి పంపటానికి మాత్రం ప్రయత్నించకు. అది తిరిగి వచ్చేసరికి ఇక్కడ తీసుకోవటానికి ఎవ్వరూ ఉండరు. పిన్ని పుస్తెలమ్మి కొంత డబ్బు నా కిచ్చింది, ఈ రెండు వేల రూపాయలు పంపటాని కయ్యే పోస్టల్ ఖర్చులకని. మిగిలింది ప్రేమ సమాజానికి తన శవాన్ని దహనం చేయమని ఇచ్చింది. ఇది నీకు చేరి, చేతిలో ఉన్నాటికి పిన్ని మరణం చెందుతుందమ్మా! తన చావుతేదీని తానే నిర్ణయించుకుందమ్మా! త నెవరి కోసం బ్రతకాలి? మరి కొన్నాళ్లు బ్రతికినా, పూటపూటకూ ఒకరి



చిత్రం—ఆర్. ఎస్. వి. సుందర్ (హైదరాబాదు-20)

మీద అన్నం కోసం ఆధారపడి బ్రతికే కన్న, మరణంకన్న అతి మంచి పని మరొకటి లేదనిపించింది. మనసులో బాధగా ఉన్నా జానకమ్మ చేస్తున్న పనిని అభినందించకుండా ఉండలేకపోతున్నా నమ్మా! పిన్ని ఆత్మశాంతికి, మైల బాపుకునేందుకు నువ్వు తప్పక స్నానం చేయాలి, శాంతమ్మతల్లీ! —ఇట్లు మీ సవతితల్లి జానకమ్మ తరఫున రంగయ్యతాత."

శాంతి మొదలు నరికిన చెట్టులా కూలిపోయింది.

లోన భాస్కరరావు తల్లితండ్రులతోను, చెల్లాయితోను డబ్బు పదేపదే లెక్కపెడుతున్నాడు. ★